www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 1 ఫిబ్రవరి 2025

5

తూర్పుగోదావరి




పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఫిబ్రవరి నెల పింఛను పంపిణీకి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శనివారం యథావిధిగా పింఛన్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున క్షేత్ర స్థాయి అధికారులకు, పెన్షన్ పంపిణీ చేసే సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు. పెన్షన్ పంపిణీ కోసం 9,041 క్లస్టర్ ఏరియాల్లో 5,158 మంది పిడిఒల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 2,36,331 మందికి పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సగటున ప్రతి పెన్షన్ పంపిణీ అధికారులకి (పిడిఒ) 46 పింఛన్లు అందించాల్సి ఉంటుందన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పైనే ఆశలు

- రైలుకూత కోసం కోనసీమ వాసుల ఎదురుచూపులు
- కాకినాడ సెజ్‌లో కానరాని పరిశ్రమలు
- పెట్రో కెమికల్ కాంప్లెక్ నిర్మాణంతో ఉపాధి
- పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్ హామీ అమలయ్యేనా.!



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదేళ్లు దాటినప్పటికీ బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమీ కనిపించడం లేదు. గత బడ్జెట్లలో కేటాయింపులు చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. ప్రతిసారీ గంపెడు ఆశలు పెట్టుకోవడం, బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత నిరాశకు గురవడం షరా మామూలుగానే జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏపికి ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఇక్కడి ప్రజలకు ఆశిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలో భారీగా నిధులు కేటాయిస్తారని ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కూడా బిజెపిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేరుగా ప్రధాన మంత్రి మోడీతో సత్సంబంధాలు కలిగిన పవన్ ఈసారి ఏపీకి ఏ విధమైన నిధులను తీసుకొచ్చేందుకు కృషి చేశారనేది చర్చనీయాంశంగా మారింది. పిఠాపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన జిల్లాలో సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిధులను రప్పించనున్నారో నేటి బడ్జెట్లోతో తెలిసిపోనుంది.

1999లో యువి.కృష్ణంరాజు కాకినాడ ఎంపిగా ఉన్న సమయంలో కాకినాడ- పిఠాపురం రైల్వే మెయిన్ లైన్‌కు అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వ బడ్జెట్‌లో స్థానం ఇచ్చింది. అదే రీతిగా ఇప్పుడు కూటమిలో భాగస్వామిగా వున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రైల్వే మెయిన్ లైన్‌కు కృషి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్లోకి తీసుకువచ్చేందుకుగాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకొంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాల్సి ఉంది. 21.5 కిలోమీటర్లు ఉండే ఈ లైనుకు 2017-18లో రూ.400కోట్ల అంచనాకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది రూ.1200-1500కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు అంశం ఈ బడ్జెట్ లో ప్రస్తావనకు వస్తుందని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. కాకినాడ-కోటిపల్లి రైల్వే లైను పునరుద్ధరించాలని కోరుతున్నారు. రాష్ట్ర వాటా పేరుతో కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో కోటిపల్లి - నర్సాపురంరైలు కూడా నిలిచిపోయింది. దీంతో కోనసీమ ప్రాంతానికి రైలు కూత నేటికీ వినిపడలేదు.

కాకినాడ జిల్లా కేంద్రం అభివద్ధికి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మరో రెండేళ్ల గడువు పొడిగించే ప్రక్రియకు శ్రీకారం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కీలకమైన పెట్రో కారిడార్, భారతమాల ప్రాజెక్టులో భాగంగా ఆరు లైన్ల రోడ్లు, రిఫైనరీ, కేప్టివ్ పోర్టు, టెర్మినల్స్ ఇలా ఎన్నో ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్నాయి. వాటిపై ఈ సారి ఎటువంటి ప్రకటన వస్తుందో చూడాలి.

పోలవరాన్ని పట్టించుకుంటారా..?

భారీ ప్రాజెక్టు పోలవరాన్ని ఈసారి బడ్జెట్లో కేంద్రం ఏ విధంగా పట్టించుకుంటుందనేది కీలకంగా మారింది. గత బడ్జెట్లో నిధుల కేటాయింపుపై నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు. నిర్వాసితుల సమస్యలు గిరిజనుల పునరావసం వంటి అంశాలపై ఈసారైనా స్పష్టమైన హామీ తోపాటుగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలో తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన ఎడమ కాలువ పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. మరోవైపు నిర్వాసితులకు పరిహారం అందించడానికి ఇప్పటికైనా నిధులు కేటాయిస్తారా అనేది చూడాలి.

పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేనా.?

రూ.32 కోట్ల నిధులతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నా ఎప్పుడూ రిక్తహస్తమే చూపుతున్నారు. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14 వేల ఎకరాలను పరిశ్రమల కోసం కేటాయించారు. కాని ఎలాంటి పరిశ్రమలూ రాలేదు. తాజాగా ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నైనా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన నిర్ణయం ప్రకటిస్తారని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ పెట్రో కారిడార్ కనుక ఏర్పాటు అయితే వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి లభించే అవకాశం ఉంది.

గోదావరి పుష్కరాలకు నిధుల కేటాయించేనా?

2027లో గోదావరికి పుష్కరాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటకులకు సరైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రోడ్లు, ఘాట్‌ల ఆధునికీకరణ, రోడ్ల విస్తరణ, విశ్రాంతి భవనాల ఏర్పాటు, ఇతర ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దాదాపు రెండు కోట్ల మంది సందర్శకులు పుష్కరాలకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. వారికి మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు తప్పని సరి. ఇప్పటి నుంచి పనులు మొదలు పెడితేనే అప్పటికి పూర్తవుతాయి. కేంద్రం ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు ఎలాంటి నిధులు కేటాయిస్తుందో అందరూ ఎదురు చూస్తున్నారు.



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

కలెక్టర్ ప్రశాంతి సూచన

ప్రజాశక్తి - రాజానగరం

క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసించాలని కలెక్టర్ పి.ప్రశాంతి విద్యార్థులకు సూచించారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు)లో శుక్రవారం నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు జిజియు యాజమాన్యం సమకూర్చిన పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్ణయించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. లక్ష్య సాధనకు కష్టపడి చదవడమే ఏకైక మార్గం అన్నారు. దీనికి ప్రత్యామ్నాయ పద్ధతులు లేవన్నారు. విజ్ఞానం పొందాలంటే పాఠ్యాంశాలను పూర్తిగా చదవాలని సూచించారు. పదో తరగతి నుంచే భవిష్యత్ ప్రయాణం మొదలవుతుందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. వివిధ రంగాల నుంచి మోటివేటర్లను ఈ సమావేశానికి ఆహ్వానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిజియు రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, డీన్ డాక్టర్ ఎన్.లీలావతి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పిజి.రామానుజమ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, సీతానగరం

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఉండ్రాజవరం, సీతానగరం మండలాల్లోని రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెకీలను ఆయా పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులకు సమాచారం ఇచ్చామని, అయినప్పటికీ ఫ్లెక్సీలు తొలగించని వాటిని అధికారుల సమక్షంలో స్వయంగా తొలగిస్తు న్నామని సిబ్బంది తెలిపారు. సీతానగరంలో ాలిమూడి, సీతానగరం, చిన్న కొండేపూడి, రఘుదేవపురం, రాపాక పంచాయతీల పరిధిలో నాయకుల ఫ్లెక్సీలు తొలగించారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొల్లూరులో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - బిక్కవోలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర వాప్తంగా జనవరి 20 నుంచి 31 వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించిందన్నారు. దీనిలో భాగంగా శుకవారం మొల్లూరులో పశువైద్య శిబిరాన్ని కాకినాడ డిఎల్‌డిఎ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. 49 దూడలు పాల్గొన్నాయి. శిబిరంలో పాల్గొన్న 50 పశువులకు చికిత్స అందించారు. విజేతలకు జిల్లా పశుసంవర్ధక శాఖా అధికారి డాక్టర్ టి.శ్రీనివాసురావు చేతులు మీదగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఎడి(ఎహెచ్) డాక్టర్ వై.శ్రీనివాపరావు, కాకినాడ డిఎల్‌డిఎ డ్టార్ టి.నవీన్, పశువైద్యులు వి.ప్రణిత, జి.వీర్రాజు, రవికూమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అవిస్కరించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలంయలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆరోగ్య శాఖలో హెల్త్ ఎడ్యుకేటర్ల పాత్ర ప్రధానమైందన్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్య విద్యను బోధించడం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) డాక్టర్ సత్యకుమార్ మాట్లాడుతూ మీడియా ఆఫీసర్స్ అందరు అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌లు సత్యనారాయణ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ట్రాఫిక్ నియమాలపై జిల్లా పోలీసులు అధికారులు, సిబ్బందితో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ, లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్‌పి అల్లూరి వెంకట సుబ్బరాజు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి ఆజాద్ చౌక్, దేవిచౌక్ గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కర ఘాట్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం పుష్కర ఘాట్ వద్ద మానవహారం నిర్వహించారు. ఎస్‌పి డిఎస్‌పి బి.రామకృష్ణ, ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, ఈస్‌జోన్ డిఎస్‌పి బి.విద్య, ఎఆర్ డిఎస్‌పి రవికుమార్, ఎస్‌పి సిఐ ఎ.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐలు నబి, సిహెచ్.సూరిబాబు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో అవగాహనా ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు

నిడదవోలు : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నిడదవోలు పట్టణంలోని గణపతి సెంటర్‌లో ఎకెఆర్‌జిసి స్కూలు ఆధ్వర్యంలో రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిడదవోలు పట్టణ ఎస్‌ఐ పరమహంస, సమిశ్ర గూడెం రూరల్ ఎస్‌ఐ పి.వీరబాబు హాజరై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ : ట్రాఫిక్ నియమాలు ప్రతీ ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని నార్త్ జోన్ డిఎస్‌పి వై.శ్రీకాంత్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కోరుకొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ హెల్మెట్‌లు ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సిఐ వై సత్యకిషోర్, ఎస్‌ఐ శ్యాయ్ సుందర్, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం, తాడిపర్రు లో ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం : వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీరవెంకటసత్యానారాయణరెడ్డి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్‌హెచ్‌ఎఐ పీడీ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై వేమగిరి వరకు రాజమహేంద్రవరం సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్, టోల్ ప్లాజా ఉద్యోగులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారుల టెక్నికల్ మేనేజర్ అన్సారి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో రోడ్డు భద్రతపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పెద్ద వాహన డ్రైవర్ల అందరూ సీట్ బెల్ట్‌ను ఉపయోగించాలన్నారు. హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారని తెలిపారు. అతివేగం ప్రమాదకరమని, వేగంకన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ వెంకటరమణ, రాజమహేంద్రవరం క్రైం సిఐ రాంబాబు, ధవలేశ్వరం సిఐ గణేష్, క్యాషియర్ సురేష్, టోల్ ప్లాజా మేనేజర్ కరీం, హెచ్‌ఆర్ రమేష్ పలువురు పోలీసులు, ఎన్‌హెచ్‌ఎఐ సిబ్బంది పాల్గొన్నారు.



నిడదవోలు రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

రైళ్ల హాల్ట్ కోసం సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు

అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌గా ఎంపికైన నిడదవోలు రైల్వే స్టేషన్‌లో జన్మభూమి, ఎల్‌టిటి, కోకనాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, కోవిడ్ సమయంలో రద్దు చేసిన నిడదవోలు-భీమవరం-నరసాపురం ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిడదవోలు రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడారు. హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్ వంటి దూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి ఈ రైళ్లు చాలా సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. నిడదవోలు జంక్షన్ ఏజెన్సీకి ముఖద్వారంగా ఉంటుందన్నారు. ఇక్కడ రైళ్లకు హాల్ట్ ఇస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. తక్షణమే ఎంపీ పురంధేశ్వరి జోక్యం చేసుకుని హాల్ట్‌కు కృషి చేయాలని కోరారు. ఈ ధర్నాలో ఎం.సుందరబాబు, గంటి కృష్ణ, ఉస్మాన్, యర్రా శ్రీను, ఎం.రాజేష్, డి.సతీష్, టి.నాని తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ అనురాధ

సర్పంచ్ పేరుతో లాగిన్ అయిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తన పేరును ఉపయోగించి నెట్‌లో లాగిన్ అయ్యి ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తూ రుణాల మంజూరు ప్రక్రియకు పాల్పడుతున్న వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తాళ్లపూడి సరంచ్ అనురాధ అధికారులను కోరారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సర్పంచ్ భర్త నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ ఈ పథకం కింద దరఖాస్తు చేయాలని గ్రామానికి చెందిన పలువురు తమ వద్దకు వచ్చారన్నారు. దీంతో ఈ విషయం బయటకు వచ్చిందన్నారు. ఆరా తీస్తే పోచవరం గ్రామానికి చెందిన నీరుకొండ అనిల్ అనే వ్యక్తి తమ సర్పంచ్ అనురాధ పేరుతో లాగిన్ అయ్యి దరఖాస్తులు అప్లోడ్ చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వెంటనే అతనిపై చర్యోలు తీసుకోవాలని, నిజమైన లబ్ధిదారులకు రుణాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సత్కారం

రాజమహేంద్రవరం : తూర్పుగోదావరి జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పలువురిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యకరమంలో ఉద్యోగ విరమణ చేసి సిసిఎస్ ఎస్‌ఐ టివివిఎస్.సాంబశివరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ పి.నాగరత్నం, ప్రకాష్‌నగర్ ఎఎస్‌ఐ కెహెచ్‌హెచ్.సుబ్రహ్మణ్యం దంపతులను అడిషనల్ ఎస్‌పిలు ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అల్లూరి వెంకటసుబ్బరాజు, ఎల్.అర్జున్ శాలువాలు కప్పి సత్కరించారు. అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు ఎస్.భవ్యకిషోర్, బి.విద్య, రవికుమార్ గారు, సిఐలు, ఎస్‌ఐలు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు, నర్సరీ రైతులు

నర్సరీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంకలో గల సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో నర్సరీ ప్రముఖులు గట్టి సుబ్బారావు, మార్గాని సత్యనారాయణ, తాడాల చక్రవర్తి, పాఠంశెట్టి చినమహాలక్ష్మినాయుడు, తిరుమలశెట్టి భాస్కరరావు, రత్నం కృష్ణమూర్తి, బొర్రు సుబ్బారాయుడు రైతుల సమక్షంలో 2025 సంవత్సరం డైరీ కమ్ డైరెక్టరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, కార్యదర్శి గాద నాగేశ్వరావు, డైరెక్టర్లు గట్టా కృష్ణభగవాన్, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వరావు, అడ్డగర్ల రమేష్, తాడాల నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

మైనింగ్ శాఖ అధికారులు శుక్రవారం మండలంలో తనిఖీలు నిర్వహించారు. నాగంపల్లి గ్రామంలో సిఇర్‌బి స్టోన్ క్రషర్, రఘుదేవపురంలో ఇటుక బట్టీల వద్ద తనిఖీలు చేశారు. సిఆర్‌బి క్వారీ నిర్వాహకులు చెరువులకు సమీపంగా క్వారీలు ఏర్పాటు చేయడంపై మైనింగ్ అధికారులు సర్వే చేశారు. అనుమతి లేని ఇటుక బట్టీలను పరిశీలించారు. అనుమతి లేని బట్టీ నిర్వాహుకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారాను సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ఆర్ట్స్ కళాశాల సోషల్ వర్క్ విభాగ విద్యార్థులు రావులపాలెంలోని పారా స్వచ్ఛంధ సంస్థను శుక్రవారం సందర్శించారు. పారా ఆర్గనైజేషన్ ప్రధానాధిపతి ఫాదర్ ఫలిదాని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులను ఎలా కాపాడుకోవాలో చెప్పారు. పారా నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు, మహిళలు, ఆరోగ్యం, విద్య, హక్కుల వంటి వాటి కోసం అవగాహన కలిగిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని పారా ప్రతినిధి రమేష్ తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ రామారావు గుండె జబ్బులతో బాధ పడేవారికి ఫస్ట్ ఎయిడ్ ఇవ్వడంలో మెలకువలు, చికిత్స అందించేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ టిడి.జాన్ భావోద్వేగాలపై మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు ఎలా చేరవేయాలో, ఎలాంటి సాయం అందించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-గోకవరం

మానవ హక్కులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని, హక్కుల కోసం అందరూ అవగాహన కలిగి ఉండాలని గోకవరం మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సాగర్ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం గ్రామపంచాయతీ పరిధి కొత్తూరు గ్రామంలో శుక్రవారం మానవ హక్కుల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన కుల ధ్రువీకరణ పత్రాలు, ఇళ్ల స్థలాల సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. స్థానిక సమస్యలపై ఆయన స్పందిస్తూ మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు విషయమే ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ నిరంతర ప్రయత్నం చేస్తున్నారన్నారు. కుటమి ప్రభుత్వంలో పల్లె ప్రాంతంలో 3 సెంట్లు స్థలం లబ్ధిదారులకు అందబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు మండిగ బాలాజీ, మీడియా మండల కో-ఆర్డినేటర్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కొంగరపు రాజు, గ్రామ రైతు అధ్యక్షులు బోలకొండ రాజారెడ్డి, ఆర్ఐ వల్లి, విఆర్ఒ లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేటి నుంచి భూముల ధరలకు రెక్కలు



- అర్బన్, రూరల్ ఏరియాల్లో 10 నుంచి 40 శాతం వరకు పెంపు
- పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- ఇప్పటికే పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో పతనమేనంటున్న వ్యాపార వర్గాలు

ప్రజాశక్తి - రాజోలు

కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా ప్రజలపై మరో భారం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. ఇదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైన సంగతి తెలిసిందే. ఇసుక కొరత నేపథ్యంలో అనుబంధ రంగమైన భవన నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత కుదిపేసింది. ఈ పరిస్థితులను చక్కదిద్దుతామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కేవలం 7 నెలల్లోనే భూముల రిజిస్ట్రేషన్ ధరల పెంపునకు తెరతీసింది. ఈ నేపథ్యంలో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెరగనున్నాయి. ఉదాహరణకు రాజోలు నియోజకవర్గంలో గల్ఫ్ దేశాలలో ఉపాధికోసం వెళ్లి ఆర్థికంగా స్థిరపడిన వారి సంఖ్య ఎక్కువ దీంతో మలికిపురం ప్రాంతంలో భూముల ధరలు అధికం. ముఖ్యంగా మలికిపురం పట్టణంలో వాణిజ్య ప్రాంతంలో గజం ధర రూ.16 వేల వరకూ ఉంది. ప్రభుత్వం ధరలు పెంచితే అది రూ.18,400 అవుతుంది. రిజిస్ట్రేషన్ చార్జీ, ఇతర ఫీజులు కలిపి ఇప్పటి వరకు రూ.1,200లు కాగా, ఇక నుంచి రూ.1,300 చొప్పున కానుంది. చదరపు గజం విలువ ప్రస్తుతం రూ.30 వేలు కాగా 15 శాతం పెరగనుంది రూ.34,500కు చేరనుంది. దీంతో సామాన్యులు 100 గజాలు కొనుగోలు చేస్తే అదనంగా రూ.4.50 లక్షలు భారం పడనుంది. అమలాపురంలో రూరల్ ఏరియాలో ప్రస్తుతం చదరపు గజం ధర రూ.7,000 కాగా త్వరలో రూ.8,050కి చేరనుంది. ఇక్కడ కూడా 100 చదరపు గజాలు కొనుగోలు చేస్తే అదనంగా రూ.లక్ష భారం పడనుంది. మలికిపురం ఏరియాలో ప్రస్తుతం చదరపు గజం రూ.3,600 కాగా నేటి నుంచి10 శాతం పెరగడంతో రూ.3,960కి చేరనుంది. ఇప్పటికే ఒక వైపు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సతమతం అవుతున్న ప్రజలపై భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచి దోచుకునేందుకు రంగం సిద్ధం చేసింది

నెలకు 70 వేల రిజిస్ట్రేషన్లు

ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువ పెంచుతూ మరో బాదుడుకు సిద్ధమైంది. పట్టణ, మండల కేంద్రాల శివార్లలోని వెంచర్లు, రోడ్డు పక్క స్థలాలు లక్ష్యంగా అర్బన్, రూరల్ ఏరియాల్లో రిజిస్ట్రేషన్ విలువ 10 నుంచి 40 శాతం వరకు పెంచుతూ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. జిల్లాలో 12 వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా నెలకు 70 వేల వరకు రిజిస్ట్రేషన్లు ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. రిజిస్ట్రార్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలను నిర్ణయిస్తారు. ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్‌పై స్టాంపు డ్యూటీ, ఛార్జీల నిమిత్తం 7.5 శాతం, సెటిల్‌మెంట్, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లయితే 2.5 శాతం, పార్టిషన్ రిజిస్ట్రేషన్ అయితే ఒక శాతం, మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ అయితే లోన్‌పై 0.6 శాతం వరకు ప్రభుత్వానికి చెల్లించాలి.

ఇప్పటికే పన్నులు పెంచేశారు

ఇప్పటికే నిర్మాణాల విలువను ప్రభుత్వం ఖరారు చేసి ఉత్తర్వులిచ్చింది. కార్పొరేషను, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు, నాన్ ఆర్‌సిసి రూఫులతోపాటు ఫ్లాట్లు, గోడలు లేని ఇళ్ల విలువను పెంచేసింది. కార్పొరేషను, మున్సిపాల్టీల్లో ఉన్న అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువను రూ.1,490కి పెంచింది. నగర పంచాయతీల్లో చదరపు అడుగు రూ.1,270, గ్రామ పంచాయతీల్లో చదరపు అడుగుకు రూ.900కు పెంచింది. సెల్లార్, పార్కింగ్ ఏరియాతోపాటు ప్రతి అంతస్తులో అదనపు ఫ్లోర్లకు రేటు పెంచారు. వాణిజ్య భవనాల విలువను కార్పొరేషను, మున్సిపాల్టీల్లో రూ.1,800కు, గ్రామ పంచాయతీల్లో రూ.1,540కి, పంచాయతీల్లో రూ.1060కు పెంచారు. ఇతర ఆర్‌సిసి నిర్మాణాలో కాకుండా ఆర్‌సిసి రూఫ్ లేని ఇళ్ల విలువను సైతం పెంచేశారు. చివరికి పెంకుటిళ్లు, పాకలు, గోడలు లేని ఇళ్లను సైతం వదలకుండా వాటి విలువను చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.20 వరకూ పెంచింది. అన్ని రకాల నిర్మాణాల్లోనూ ఎస్‌ఎఫ్‌టి రేటు రూ.30 నుంచి రూ.90 వరకు పెంచారు.

భారీగా పెరగనున్న ఛార్జీలు

సవరించిన ధరలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని అర్బన్ ఏరియాల్లో 35 శాతం, రూరల్‌లో 40 శాతం వరకు భూముల విలువలు పెరుగుతున్నాయి. అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో 20 శాతానికి పైగా, అధిక శాతం మండలాల్లో 30 శాతానికి పైగా పెరిగాయి. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ఛార్జీల భారీగా పెరుగుతాయని వివిధ వర్గాలు అంటున్నాయి. తాజా పెంపుతో అమలాపురం, రావులపాలెం,కొత్తపేట తదితర కొన్ని పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే ప్రభుత్వ ధర ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

నేరాలు ఘోరాలు

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి-కాజులూరు

గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేటలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. శుక్రవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో ఒక కోడి, రెండు కత్తులు, రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

వాహన తనిఖీలలో భాగంగా మద్యం తాగి వాహనం నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో తీసుకొని శుక్రవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో వివిధ రహదారి కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అధిక మద్యం తాగి వాహనం నడుపుతూ కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లికి చెందిన అర్థపల్లి శ్రీరామకృష్ణ, మండల కేంద్రానికి చెందిన పెండ్రాజుల భాస్కర్ గణేష్, మండలంలోని మడికి చెందిన కుప్పిరెడ్డి శ్రీనులు పట్టుబడ్డారన్నారు. దీంతో ఆలమూరు కోర్టు మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరావు నాయక్ ఒక్కొక్కరికి ఒక నెల రోజుల చొప్పన జైలు శిక్ష విధించారని ఎస్సై అశోక్ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని 216 జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం వ్యాన్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. పెట్రోల్ బంకు జంక్షన్‌లో యూ టర్న్ తీసుకుంటున్న ఒక వ్యాన్‌ను తప్పించబోయిన కాకినాడ నుంచి యానాం వైపు వస్తున్న శ్రీహరి డైలీ పార్సిల్ వ్యాన్ పక్కనే ఉన్న మురుగు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో రోడ్డుపక్క చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి బైకులు ధ్వంసమయ్యాయి. ఆ దుకాణాల వద్ద ఎక్కువ జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలోని ఒక యువతి అదృశ్యంపై శుక్రవారం యానాం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక కనకాలపేట దంగుడుబియ్యం గంగాధర్ రావు ఇంట్లో అద్దెకు ఉంటున్న అనుబోణి గోవిందరాజులు, పార్వతి కుమార్తె అనుబోని రమ్యశ్రీ (17) ఈ నెల 25వ తేదీ నుండి కనిపించడం లేదని తెలిపారు. రమ్యశ్రీ సుంకరపాలెం ప్రెష్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కాలేజీకి పరీక్ష రాయడానికని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి అనుబోణి పార్వతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురుగానందం తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం కెల్లిగళ్ల వేటకు చెందిన బాలిక అదృశ్యమైందని సీతానగరం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ కళ్యాణి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా మందుల విక్రయాలు, అక్రమ వ్యాపారాలు సాగించడంపై జనవరి 17న ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో బిల్లులు, స్టాక్‌లో వ్యత్యాసాలు గుర్తించారు. పలు షాపుల్లో ఫార్మసిస్టులు లేకపోవడం గుర్తించారు. ఈ మేరకు డ్రగ్ ఇన్స్పెక్టర్ కళ్యాణి మాట్లాడుతూ తప్పనిసరిగా మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు ఉండాలన్నారు. హయర్ యాంటీబయోటిక్స్‌కు సంబంధించి ఆరోపించి చిటీలతో మందులు విక్రయించరాదన్నారు. మందుల స్టాక్‌కు సంబంధించి లెక్కలు సరిగా లేకుంటే షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం జరిగిన దాడుల్లో పలు షాపులపై కేసులు నమోదు చేయనున్నామని తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - కడియం

ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని టిడిపి మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని అన్నారు. శుక్రవారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి నాగబాబు ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్య వైశ్య సంఘం నాయకులు నేతి నానాజీ, చెక్కా కాశీ, బొడ్డు సత్యనారాయణ, వెత్స లక్ష్మీనారాయణ, సాయి పాల్గొన్నారు.

ఆకుకూరల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా 96, 97 నెంబర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పండించిన ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అండ్ సరోగేట్ స్టీల్ బోర్డు మెంబర్ విజయనిర్మల, ఉమెన్ ట్రైన్ సభ్యులు కుమారి, అంగన్‌వాడీ టీచర్లు పద్మకామేశ్వరి, మంగతాయారు, సహాయకులు వేణు, దేవేస్వరి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాధికారిగా విద్యారామన్

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యర్నగూడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ విద్యారామన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వగ్రామం మలికిపట్నం వద్ద కేసనపల్లి. బిఎఎంఎస్ విద్యను విజయవాడలో పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాదులో ఎంఎస్ పూర్తి చేసి తొలి పోస్టింగ్ యర్నగూడెంలో చేరారు. అనంతరం ఇక్కడకు వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.



ఎంపిలు సుబ్బరాజుకు వినతిపత్రం అందజేస్తున్న టైలర్స్‌అసోసియేషన్

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

టైలర్ ఫెడరేషన్‌లు, సొసైటీలను బలోపేతం చేసేందుకు నిధులను మంజూరు చేయాలని బాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. టైలర్స్ అసోసియేషన్ శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో సత్యనారాయణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు, రజక ఫెడరేషన్‌లకు ఇస్తున్న విధంగా సబ్సిడీ తో కూడిన విద్యుత్ యూనిట్ల ను అమలు చేయాలని, టైలర్ ఫెడరేషన్ అభివృద్ధి కి నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తీర్మానించారు. అనంతరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టైలర్స్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిపిఎస్ బాలయోగి జిపిఎ బాలికోన్నత పాఠశాలకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఆర్‌ఒ ప్లాంట్ ను శుక్రవారం ఎంఎల్‌ఎ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు వివిధగా సహకారం అందించి అభివృద్ధి కి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కార్పొరేషన్ రిటైల్ వ్యాపార ఎస్‌విపిసిసి జెబిడి.వర్మ తో పాటు చెల్లి అశోక్, గోలకోటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నగరపంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అజెండాను ప్రవేశపెట్టకుండా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నగర పంచాయతీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ పేదలు ఇల్లు కట్టుకునేందుకు ఇచ్చే పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయడానికి రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న రెవిన్యూ అధికారుల తీరుపై న మండిపడ్డారు. అలాగే నగర పంచాయతీ పరిధిలో పలు వార్డులలో ట్రాన్స్ఫార్మర్లు పొదలతో నిండిపోయి ఉన్నా విద్యుత్ శాఖసిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, పొదలపై ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పలువరి ప్రాంతాల ప్రజలు ప్రాణ భయంతో గడుపుతున్నారని జూనియర్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డు సచివాలయం పరిధిలోని సంబంధిత సిబ్బంది ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దారుణమన్నారు.అన్ని అనుమతులతో నిర్మించుకున్న గృహాలకు మీటర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చైర్మన్ కల్పించుకుని విద్యుత్ శాఖ అధికారులు తీరు మార్చుకోవాలని ఆదేశించారు. ఏడో వార్డు కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ మాట్లాడుతూ గృహ రుణాల మంజూరుకు గతంలో ఎంపిక చేసిన లిస్ట్ ప్రకారం చేస్తున్నారా లేక కొత్త లిస్ట్ ప్రకారం ఎంపిక చేస్తున్నారా అని హౌసింగ్ ఎఇ సుబ్రహ్మణ్యం ను ప్రశ్నించారు. గతం లిస్టు, కొత్త లిస్టు ప్రకారం ఎంపిక చేస్తున్నామని తెలపగా, దరఖాస్తుదారుల నుంచి రూ.3వేలు దళారుల ద్వారా వసూళ్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ నిలదీశారు. లబ్ధిదారుల ఎంపిక లిస్టును సంబంధిత కౌన్సిలర్లకు ఎందుకు తెలపడం లేదని ప్రశ్నించారు.తొమ్మిదో వార్డు కౌన్సిలర్ ఆడబాల సతీష్ కుమార్ శానిటేషన్ లేకపోవడంతో ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారని అన్నారు. రోడ్లపై పశువులు, పందులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని వీటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ, స్కూళ్లలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ నగర పంచాయతీ ఇంజినీర్ సుధాకర్ పని తీరుతో సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి నోచుకుంటున్నాయని ఎఇని అభినందించారు. 13వ వార్డు కౌన్సిలర్ కోటం జయలక్ష్మి వార్డు ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, పంపు హౌస్ కీపర్‌ని అడిగడానికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడని, లిఫ్ట్ చేసిన సమాధానం చెప్పడని, పని చేసే వారిని నియమించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. చైర్మన్ కల్పించుకుని పంపు హౌస్ కీపర్ పై ప్రజల నుండి ఆరోపణలు వస్తున్నాయని ఆతనిని అక్కడి నుండి తప్పించి, మంచి వర్కర్ ను నియమించాలని కమిషనర్‌ను ఆదేశించారు. 19వ వార్డు కౌన్సిలర్ సొజ్జా మాట్లాడుతూ నగర పంచాయతీ కి సమాచార రాజదీ వివరాలు అడిగితే, కనీసం కౌన్సిల్ సభ్యులకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనికి కమిషనర్ సమాధానమిస్తూ ఆర్టిక వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. అనంతరం నగర పంచాయతీ ఇంజినీర్ సుధాకర్‌ను కౌన్సిల్ సభ్యులు సత్కరించారు.



నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా కృషి చేయాలని ముమ్మిడివరం ఎంపిపి కోలా గంగాభవాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం ఎంపిపి గంగాభవాని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో ఎండిఓ బి.తేజ శ్రీ వెంకటాచార్యు, పంచాయతీ రాజ్ డిఇఇ విజయ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి ప్రభుత్వంపై వైసిపి నేతలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదమని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి విధ్వంసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడి సుపరిపాలన వైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న కూటమి ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయడానికి వైసిపి నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఫీజు పోరు పేరుతో పోస్టర్ విడుదల కార్యక్రమం చేపట్టి ఎన్డీఏ ప్రభుత్వంపై వైసిపి నేతలు చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు.

రేపు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం సబ్‌స్టేషన్ కెవి132 లో విద్యుత్ పరికరాలు మార్పు చేస్తున్నామని ఈ కారణంగా మూడు మండలాల్లో ఆదివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఇఇ భాగా రహంతుల్లా, రామచంద్రపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సంయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కె.గంగవరం మండలం, రాయవరం మండలం, రామచంద్రపురం మండలాల్లో గల పరిసర ప్రాంతాల్లోనూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కె.గంగవరం

గ్రామంలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువులను ఉపయోగించి అధిక ఆదాయం పెంచుకోవాలని డిపిఓ శాంతకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం కె.గంగవరం మండలంలో గల గ్రామపంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. తడి పొడి చెత్త వల్ల తయారయ్యే ఎరువుల వల్ల రసాయనాలు పదార్థాలు ఉండవని తద్వారా ఆరోగ్యవంతమైన పంటలు పండించడం సాధ్యమవుతుందని అన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకంతో పండించిన పంటల వల్ల పిల్లల్లో మానసిక ఎదుగుదల బాగుంటుందని, అంగవైకల్యాలను నివారించవచ్చని ఆమె సూచించారు. స్వయంగా చెత్త నుండి సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ కార్యదర్శి రఘురాం, సర్పంచ్ కోటి నరసమ్మ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

విద్యారంగం నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాయని పిడిఎస్ యు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, పివైఎల్ నాయకులు అంబటి కృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మూసివేతకు తెచ్చిన జిఒ 84, 85 ,117 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించి 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని, చేశారు. లేని పక్షంలో రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిలభారత విద్య హక్కుల వేదిక, ఎఐఎస్‌ఎఫ్ 1938, పిడిఎస్‌యు, డిఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 26 నుంచి మార్చి 31 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయని వివరించారు.

8,858 ఎకరాల్లో దాళ్వా వరి సాగు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 8858 ఎకరాల్లో రైతులు దాళ్వా వరి సాగు చేస్తున్నారని మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు వెదజల్లే పద్ధతిలో దాళ్వా వరి సాగు చేస్తున్నారన్నారు. మినుము 120 ఎకరాల్లో, పెసర 5 ఎకరాల్లో, మొక్కజొన్న 98 ఎకరాల్లో, వేరుసెనగ 14 ఎకరాల్లో రైతులు దాళ్వాలో సాగు చేస్తున్నారన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు హైదరాబాద్ వాసులు ఏరువ కేశవరెడ్డి, లక్ష్మీ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ 1,02,000 విరాళంగా అందజేశారని ఆ ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. దాతలు ముందుగా శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటము, ప్రసాదం అందజేశారు.

విజేతలకు నగదు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరపున మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. మామిడికుదురు హైస్కూల్ టెస్ట్ విద్యార్థి ఎం.సింధుకు రూ.2 వేలు, ద్వితీయ విజేత ఈదరాడ హైస్కూల్ టెస్ట్ విద్యార్థి ఎల్.వరుణ్‌కు రూ.1,500 అందజేశారు. పాఠశాల స్థాయిలో 6 నుంచి 10 వరకు నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానములో నిలిచిన విద్యార్థికి రూ.1,500 ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి రూపాయలు నగదు ను పూర్వ విద్యార్థి పిల్లి వెంకటస్వామి జ్ఞాపకార్థం అందజేశారు. 2024 25 టెస్ట్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్థానములో నిలిచిన బాలుర విభాగంలో పోతుల రాహుల్, బాలిక విభాగంలో కాండ్రేగుల ఇంద్రాలక్ష్మి లకు ఒక్కొక్కరికి రూ.2,500 నగదు బహుమతులు లు ను పాఠశాల పూర్వ విద్యార్థి కడలి వీర వెంకట గోపాలకృష్ణ, రిటైర్డ్ ఐఎం బికెహెచ్‌ఎల్ హైదరాబాదు వారి సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎంలు యరుబండి లక్ష్మయ్య, మైలవరపు రవీంద్రనాథ్, నయనాల వేణుగోపాల్, కంచి సత్యనారాయణ, నన్నేపా హన్నారావు, కటకంశెట్టి సోమశేఖర్ రావు, నయనాల వెంకటేశ్వరరావు, నయనాల తమ్మారావు, హైస్కూల్ హెచ్‌ఎం సిహెచ్.నిరంజని తదితరులు పాల్గొన్నారు.

126 పశువులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వేలంపాలెంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మేడిశెట్టి కష్టార్జున ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 126 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. పరిసర ప్రాంతాలు రైతులు పశువులను తీసుకువచ్చి వైద్య శిబిరంలో వైద్య సేవలు వినియోగించుకున్నారు. పశు వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో సేవలు అందించారు.

అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - మండపేట

విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉంటుందని, అధ్యాపకులందరూ అంకిత భావంతో పనిచేయాలని నాక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కులకర్ణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా విషయక అంశాల పరిశీలనకు గురువారం నాక్ బృందం ప్రతినిధులు వచ్చారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలోనాక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కులకర్ణి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు నాక్ బృందం ప్రతినిధులు వచ్చిన వివరాలను తెలియజేశారు. మూడు రాష్ట్రాల నుండి వచ్చిన ముగ్గురు ప్రతినిధుల బృందం రెండు రోజుల పాటు కళాశాలలో విద్యా సంబంధమైన విషయాలతో బాటు కళాశాల మౌలిక వసతుల కల్పన, మొదలగు విషయాలను పరిశీలించినట్లు, గ్రేడ్ ను ప్రకటించ నున్నట్లు ఆయన తెలిపారు.బందం కళాశాలలో వివిధ విభాగాలను పరిశీలించి, విద్యార్థుల తల్లి తండ్రులు, కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలను చర్చించారు.గత మూడు సంవత్సరాలలో కళాశాలలో చేసిన అభివృద్ధి సోలార్ పవర్ ప్లాంట్ , ఎసి లైబ్రరీ, కళాశాల గ్రౌండ్ అభివృద్ధి, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు తదితర అంశాలను నాక్ బృందానికి తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనంద్, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ కిరణ్, అధ్యాపకులు డాక్టర్ నెహ్రూ నాయక్, డాక్టర్ శంకర్, గోపాలకృష్ణ, సుందర్, రాజేష్, అభినయ, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, మాత రామాభాయి మహిళా సంఘాలు సంయుక్తంగా వడ్డీ నాగేశ్వర రావు అధ్యక్షతన విప్లవ గాయకుడు గద్దర్ 77వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్, గద్దర్ చిత్రపటాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుణ్యమంతుల రజని, జంగా తనూజ, ఈతకోట గోరి, అంజనేయులు, సిద్దార్థ కుమార్, నరేష్ కుమార్, కాశి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మూక్ నాయక్ పత్రిక ఆవిర్భావ వేడుకలు


ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శరత్ ఆధ్వర్యంలో మూక్ నాయక్ 105వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుడు, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలకు సామాజిక కార్యకర్త సకిలే పద్మీరాజ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పుల్లీరాజేశ్‌ఆయన మాట్లాడుతూ నోరుండి తమ సమస్యలను చెప్పుకోలేని వారి కోసం ఏర్పడిన మొట్టమొదటి పత్రిక మూక్ నాయక్ పత్రిక అని అన్నారు. కార్యక్రమంలో వడ్డీ నాగేశ్వర రావు,నల్లా సూర్య ప్రకాష్, వెంకట రమణ, పెద బాబు, పండుబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అందం, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసే అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను స్థానిక దానవాయిపేటలో సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఫౌండర్, ఎండి శరత్ చెల్ జేతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసు మాట్లాడుతూ విశ్వసనీయత ఉండబట్టే రాష్ట్రంలో 15బ్రాంచీలను నెలకొల్పారని అభినందించారు. త్వరలోనే 50 బ్రాంచీలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో అందం అతివలకే కాకుండా పురుషులకు కూడా అవసరం అవుతుందన్నారు. అందుకే గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను ఉపయోగించుకుని అందంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. లాల్ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఫౌండర్, ఎండి శరత్ చెల్ జే మాట్లాడుతూ అందాన్ని మెరుగుపరచడంలో అత్యుత్తమ చికిత్స అందించడంలో తమ క్లినిక్ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. తమ ప్రయాణంలో రాజమహేంద్రవరం బ్రాంచి మరో మైలురాయి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సర్వీసు అందించడమే లక్ష్యమన్నారు. జుట్టు మళ్లీ రావడంలో, చర్మం పునరుజ్జీవనంలో అత్యుత్తమ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతను సున్నితమైన సంరక్షణతో సమ్మిళిత చేస్తున్నామని చెప్పారు. ఈ క్లినిక్ పెర్సొనలైజ్డ్ నియస్ ఎస్ యూ ఈ హెయిర్ (ట్రాన్స్) ప్లాంట్, స్టెమ్ ఎక్స్ 27 (పి పిఆర్పీ ప్రో), లేజర్ హెయిర్ థెరపీ, రీజెన్ ప్రో 9 ఇతర ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి న్నారు. ఇవన్నీ యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం పొందిన విశ్వసనీయ చికిత్సలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ప్రతాపంత చర్మానికి ఈ క్లినిక్ విప్లవాత్మక చికిత్సలను అందిస్తుందన్నారు. వీటిలో గ్లుటాథియోన్ ఐవి, హైడ్రోఫేషియల్, హ్యూస్టన్ లేజర్, బోటాక్స్, ఫిల్లర్స్, థ్రెడ్ లిఫ్ట్, పూర్తి శరీర లేజర్ హెయిర్ తొలగింపు ఉన్నాయని చెప్పారు. ఫలితాలు సమర్థవంతంగా సాంకేతికతతో నిర్వహించే ఈ చికిత్సలు అద్భుత ఫలితాలను అందిస్తాయని తెలిపారు. ఎంతో నైపుణ్యం కలిగిన బృందంతో ఈ క్లినిక్ కొత్త ప్రమాణాలను సెట్ చేస్తున్నామన్నారు. అసాధారణ సంరక్షణ, అద్భుతమైన ఫలితాల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. అధిక నాణ్యతతో కూడిన సేవలు, అందరికి అందుబాటులో ఉండేలా సులభంగా అందించనున్నామని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉత్తమంగా కనిపించేలా, అనుభూతి చెందేలా తమ క్లినిక్ చేస్తుందన్నారు. ఈ క్లినిక్ అందరూ సందర్శించాలని తద్వారా అడ్వాన్స్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ అందమైన ఆరోగ్య సంరక్షణలో విశ్వసనీయ నాయకుడుగా ఎందుకు ఉందో స్వయంగా తెలుసుకోవాలని ఆయన కోరారు. అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ జుట్టు పెరుగుదల, చర్మ చికిత్సల రంగాల్లో అగ్రగామిగా ఉందని, అద్భుతమైన నైపుణ్యం, వినూత్నత గల సేవకు ప్రసిద్ధి చెందిందని, యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం పొందిన పరిష్కారాలతో అసాధారణ ఫలితాలను సాధించడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ క్లినిక్ ఎస్తెటిక్ మెడిసిన్‌లో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలిచిందని వివరించారు. పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు, విచ్చేసి శుభాకాంక్షలు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు